మజర్‌హుస్సేన్‌కు ఇంటర్నేషనల్ పీస్ అవార్డు



అవార్డును అందుకుంటున్న మజర్ హుస్సేన్

హైదరాబాద్ సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): కన్ఫెడరేషన్ ఆఫ్ వలంటరీ అసోసియేషన్(కొవ) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మజర్ హుస్సేన్‌కు 'మజ కొనె ఇంటర్నేషనల్ పీస్ అవార్డు -2024'ను స్విట్జర్లాండ్‌కు చెందిన 'సెంటర్ ఫర్ సోషియో కల్చరల్ ఇంటర్నేషన్ ఎ నాట్ ఫర్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్'(సీఈఎస్‌సీఐ) మధురైలో మంగళవారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మార్గరెట్ హ్యుజెన్‌టొబ్లర్ ప్రశంసాపత్రాన్ని అవార్డు గ్రహీతకు అందజేశారు. మూడు దశాబ్దాలుగా హింస, మతకలహాల వంటి సమస్యలకు వ్యతిరేకంగా మజర్ చేస్తోన్న సేవలకు గుర్తింపుగా ఆయన్ను ఈ అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఈఎస్‌సీఐ భారత అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రెటరీ ఎస్‌సీ బెహర్‌తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ చిన్నారెడ్డి రైతు పక్షపాతి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


చిన్నారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న మంత్రి తుమ్మల, సంఘం నాయకులు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ చిన్నారెడ్డిని మంగళవారం రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్)లో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నలభై సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ఉన్న చిన్నారెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఆయన ఎప్పుడూ రైతులకోసం మాట్లాడే వ్యక్తి అని గుర్తు చేశారు. గత శాసనసభ ఎన్నికలలో చిన్నారెడ్డి వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి ఉంటే ఆయనే వ్యవసాయశాఖ మంత్రి అయ్యి ఉండేవారన్నారు. వ్యవసాయ రంగంపై అపూర్వ అనుభవం ఉన్న చిన్నారెడ్డి ఆలోచనలను తీసుకుని ముందుకు సాగుతానని తుమ్మల అన్నారు. ప్రభుత్వానికి పేరు వచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు పనులు చేయాలని సూచించారు. అంతకుముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డాక్టర్ చిన్నారెడ్డి భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షీ రామన్ సుందరం, రాష్ట్ర వ్యవసాయశాఖాధికారుల సంఘం చైర్మన్ డాక్టర్ వైద్యనాథ్, అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విద్యాసాగర్, రిటైర్డ్ డీన్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 15, 16 తేదీల్లో నగరంలో పర్యటిస్తున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి నిలయంలో పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఫైర్, ఎనర్జీ, బీఎస్ఎన్ఎల్, ఐటీ, పీఆర్‌అండ్ ఆర్‌డీ, కంటోన్మెంట్ అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ వెంకటి, ఏసీపీ వీవీఎస్ రామలింగరాజు, అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రావు, అటవీశాఖ అధికారి జ్యోతి, ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

పంజాగుట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం యూసుఫ్‌గూడలోని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి మాట్లాడుతూ 24 రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని, ఒకపూట బడితోపాటు మే నెలంతా టీచర్లు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం నిర్వహించిన సమీక్షలో అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని సీఎం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో మైత్రివనం సిగ్నల్ వరకు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత, శోభ, సీఐటీయూ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

అధిక అనస్తీషియాతో ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య


రాముునాయక్ (ఫైల్)

అల్వాల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. అధికమొత్తంలో అనస్తీషియా (రోగికి ఇచ్చే మత్తుమందు) తీసుకోవడం వల్లే చనిపోయినట్టు తెలుస్తున్నది. ఈ సంఘటన మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఎస్‌హెచ్ఓ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్, బ్రాహ్మణపల్లికి చెందిన చత్రూనాయక్ కుమారుడు రామునాయక్ (27) గ్రేటర్ పరిధిలోని అల్వాల్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గత పదేళ్లుగా అనస్తీషియా ఇచ్చే డాక్టర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి తండ్రితో మాట్లాడిన రామునాయక్ ఆస్పత్రిలో విధులకు హాజరవుతున్నట్లు తెలిపాడు. అయితే, మంగళవారం ఉదయం ఆస్పత్రిలోని ఐసీయూలో బెడ్‌పై అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రామునాయక్ చేతికి అనస్తీషియా ఇంజక్షన్ తీసుకుంటున్న ఆధారం గల సీసీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో అనస్తీషియా తీసుకున్నందునే రామునాయక్ మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

యాజమాన్యం ఒత్తిడి వల్లేనంటూ ఫిర్యాదు

ఆస్పత్రిలో పదేళ్లుగా పనిచేస్తున్న రామునాయక్‌కు యజమాన్యం నిత్యం నైట్ డ్యూటీలనే వేస్తూ మానసిక ఒత్తిడికి గురిచేసిందని అతని సోదరి పార్వతి ఆరోపించారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని గత మూడేళ్లుగా కోరుతున్నా ఆస్పత్రి యాజమాన్యం ఇవ్వకుండా అతన్ని వేధించిందని ఆమె మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల క్రితం ఆస్పత్రిలోనే అనస్తీషియా డోస్ తీసుకున్నప్పటికీ యాజమాన్యం తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. రామునాయక్ మృతికి ఆస్పత్రి యాజమాన్య వైఖరే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమిత చెరువుల సర్వే షురూ!

● తొలుత వంద ఎకరాలకు పైగా ఉన్న ఆయకట్టు చెరువులు
● ఆక్రమణలను గుర్తించి, తొలగించేందుకు రంగం సిద్ధం?


డిజిటల్ సర్వే ద్వారా చెరువు విస్తీర్ణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు ఆక్రమణకు గురయ్యాయని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి సర్వేకు రంగంసిద్ధం చేసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆక్రమణకు గురయిన చెరువులు, కుంటలను మరోసారి క్షేత్రస్థాయిలో సర్వేచేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి నేతృత్వంలో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు సర్వే పనులు ప్రారంభించారు.

హయత్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ శాఖ పరిధిలో సుమారు 314 చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, కత్వలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 163, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 151చిన్న, పెద్దచెరువులు, కత్వలు, చెక్‌డ్యాంలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ఆక్రమణకు గురైన, అవుతున్న చెరువులనే అధికారులు సర్వేచేసి, విస్తీర్ణం, ఆక్రమణకు గురైన విస్తీర్ణం వివరాల నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నారు.


మాసబ్ చెరువులో ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లను పరిశీలించి సర్వే చేస్తున్న అధికారులు

తుర్కయంజాల్ మాసబ్ చెరువులో సర్వే..

కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి నేతృత్వంలో తుర్కయంజాల్‌లోని మాసబ్‌చెరువు సర్వే పనులను ప్రారంభించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, ఇరిగేషన్ ఏఈ తాస్విన్ రజా సమక్షంలో సర్వేయర్ జ్యోతి, సాయికృష్ణారెడ్డి తోపాటు పలువురు సిబ్బంది చెరువు ఆక్రమణలను సర్వే చేశారు.

'మాసబ్'లో భారీ ఆక్రమణలు?

ఇబ్రహీంపట్నం చెరువు తరువాత అతిపెద్ద చెరువైన తుర్కయంజాల్ మాసబ్‌చెరువు. సుమారు 320.20 ఎకరాల్లో విస్తరించి ఉంది. మంగళవారం అధికారులు జరిపిన సర్వేలో పెద్ద ఎత్తున్న ఆక్రమణలను గుర్తించినట్లు తెలుస్తుంది. చెరువుకు ఉత్తరం వైపున కొంత మంది చెరువును పూడ్చి రోడ్డు వేసినట్లు, చెరువుకు దక్షిణం, పడమటి భాగాల్లో రియల్ వ్యాపారులు ఎఫ్‌టీఎల్ ఏరియాలో వెంచర్లు చేసినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి..!

సర్వే ఇలా..

ప్రభుత్వ ఆదేశంతో గత బుధవారం రంగారెడ్డి కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశమై చెరువులను సర్వే చేయాలని ఆదేశించారు. మొదటగా 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న పెద్ద చెరువులనే సర్వే చేయాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను మరోసారి పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిసింది. చెరువు పూర్తివిస్తర్ణ, ఆక్రమణలో ఉన్న చెరువు భాగం, బఫర్‌జోన్ ప్రాంతాల వివరాలను నివేదించాలని సమాచారం. తరువాత ప్రభుత్వం చేత గుర్తించబడి ఆక్రమణలో ఉన్న చిన్న చెరువులను సర్వేచేసి ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేయనున్నారు. ఎక్కువగా ఆక్రమణలకు గురైన చెరువులను దృష్టిలో పెట్టుకునే సర్వే జరుగుతోంది.

'మలక్‌పేట'కు రికార్డు ఆదాయం

వ్యవసాయ మార్కెట్‌కు ఈ ఏడాది రూ.13.21కోట్ల రాబడి


మార్కెట్ కార్యాలయం బోర్డు


మార్కెట్‌లో మిర్చి

ఓల్‌మలక్‌పేట మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నగరం నడిబొడ్డులో ఉన్న మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. గతంలో ఎప్పుడూ ఇంత ఆదాయం రాలేదని మార్కెట్ అధికారులు చెబుతున్నారు ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌ను మించి ఆదాయం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వారు పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకున్నందుకు మార్కెట్‌కు 1 శాతం కమీషన్ చెల్లిస్తారు. అలా వచ్చిన కమీషనే ఈ సంవత్సరం అక్షరాల రూ.13.21కోట్లు మార్కెట్‌కు సమకూరింది గత సంవత్సరం రూ.12కోట్లు రాగా ఈసారి రూ.1.21కోట్లు అధికంగా వచ్చాయి. ఇక్కడ అమ్మకాలు, కొనుగోలు పూర్తి పారదర్శకంగా ఈ-నామ్ ప్రకారం జరుగుతుండడం వల్ల రైతులు పెద్దఎత్తున మార్కెట్‌కు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. అంతే కాకుండా రైతు తెచ్చిన పంటకు ఇక్కడ మంచి గిట్టుబాటు ధర పలుకుతుండడంతో రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రైతులు ధాన్యం తెస్తున్నారు. మార్కెట్‌లో ఉల్లి, మిర్చి, చింతపండు మూడు పంటలు కొనుగోలు జరుగుతున్నాయి. ఉల్లి మహారాష్ట్ర, గుల్‌బర్గా నుంచి, మిర్చి, చింతపండు అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ నుంచి ఎక్కువగా వస్తోంది.

రైతులకు గిట్టుబాటు ధర

రైతులు తెచ్చిన పంటకు ఈ మార్కెట్‌లో గిట్టుబాటు ధర వస్తుంది. దీంతో పెద్దఎత్తున ధాన్యాన్ని తెస్తున్నారు. కొనుగోలు పారదర్శకంగా జరుగుతాయి. రైతులకు మార్కెట్‌లో పంట అమ్మకంలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్ ఆదాయం పెంచిన రైతులకు, మార్కెట్ సిబ్బందికి కృతజ్ఞతలు.

- దామోదర్, స్పెషల్‌గ్రేడ్ సెక్రెటరి, వ్యవసాయ మార్కెట్, మలక్‌పేట్

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

చాదర్‌ఘాట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని మూసానగర్ బస్తీలో మూసీ ఒడ్డున మురుగునీళ్లలో తేలియాడుతూ కనిపించిన బాలుడిని స్థానికులు చేరదీసి చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. ఆజంపురప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ తబ్రేజ్ కుమారుడైన ఎండీ జుబేర్(6) మతిస్థిమితంలేదు. మంగళవారం ఉదయం బాలుడు మూసీ ఒడ్డున మురుగునీళ్లలో ఆడుతూ తేలియాడుతున్నాడు. స్థానికులు గమనించి చేరదీయగా, ఓ మహిళ స్నానం చేయించి దుస్తులు వేసింది. వారు పోలీసులకు అప్పగించారు. తబ్రేజ్ నుంచి బాలుని పూర్తివివరాలను నమోదు చేసుకున్నాకే అప్పగించినట్లు చాదర్‌ఘాట్ ఎస్ఐ జావేద్ తెలిపారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి: ఏసీపీ

వనస్థలిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సర్వమతాలకు పుట్టినిల్లు అయిన భారత దేశంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో, శాంతియుతంగా తమ పండుగలను నిర్వహించుకోవాలని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన పీస్ కమిటీ మీటింగ్‌కు ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మాధవరెడ్డి, పరమేష్, ఏడుకొండలు పాల్గొన్నారు.

మోదీయే మళ్లీ ప్రధాని కావాలి : ఈటల

మన్సూరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మోదీయే మళ్లీ ప్రధాని కావాలని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ ఎంపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మన్సూరాబాద్ పెద్దచెరువుప్రాంగణంలో వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని మెప్పించి అభివృద్ధికి నిధులు తీసుకొస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్‌అధ్యక్షుడు సామరంగారెడ్డి, ఎల్‌బీనగర్ బీజేపీ కన్వీనర్ రవీందర్‌గౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మహిళా వైద్యురాలిగా గర్విస్తున్నా : డా.హిమబిందు

చాదర్‌ఘాట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళలు నిత్యం తమ కుటుంబీకులకు సేవ చేయడంలో తమ ఆరోగ్యాన్ని విస్మరిస్తూ అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారని, వారికి మహిళా వైద్యురాలిగా వైద్యసేవ చేసే స్థాయికి ఎదిగినందుకు గర్విస్తున్నానని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ హిమబిందు అన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీ పార్క్‌లో శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి కమలాకర్, కోశాధికారి యాదయ్య యాదవ్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవిలత డాక్టర్ హిమబిందును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బి.రాజేశ్వర్, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మీర్‌పేట్ అవిశ్వాస ఘట్టంలో సబితదే పైచేయి

● అయినా లోలోపల అసంతృప్తి ● తమ వెంట 15 మందే ఉండడంపై అసహనం

మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్‌లాల్‌పై అవిశ్వాస వ్యవహారం మాజీ మంత్రి సబితారెడ్డికి తలనొప్పిగా మారింది. ఏదో ఒక విధంగా అవిశ్వాస గండం నుంచి బయటపడి పార్టీ పరువు, తన పరువు నిలబెట్టుకున్నా.. మేయర్‌పై ఏకంగా 35 మంది సభ్యులు అసంతృప్తిగా ఉండడాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతున్నారు. పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా తయారైందంటూ ఇటీవల ఆమె మేయర్‌పై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'అందరినీ కలుపుకుని తిరుగు.. ఒంటెత్తు పోకడలు వద్దు' అని ఆమె సున్నితంగా మందలించినట్టు సమాచారం.

సరూర్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గతంలోనూ మాజీ మంత్రి సబితారెడ్డిపై సొంత పార్టీ కార్పొరేటర్లు, నేతల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ అప్పట్లో అందరికీ ఏదోలా సర్దిచెప్పి వారిమధ్య సమన్వయం కుదిర్చారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సబిత మంత్రి పదవిపోవడంతో అసంతృప్త సభ్యులు అవిశ్వాసానికి తెరలేపారు. కలెక్టర్‌కు 31 మంది సభ్యులు లేఖ అందజేసినప్పటి నుంచి ఆమె ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని లేఖపై సంతకాలు పెట్టిన పలువురిని తిరిగి తమ గూటికి తెచ్చుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. మేయర్ మాత్రం అవిశ్వాసంపై ఏమాత్రం ఆందోళన లేకుండా 'అంతా మేడమే చూసుకుంటారు' అని నింపాదిగా ఉన్నట్టు ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. 15 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన క్యాంపు వ్యవహారాలు, ఖర్చు వగైరా కూడా సబితారెడ్డే భరించినట్టు చెబుతున్నారు. దాంతో చేతికి మట్టి అంటకుండా మేయర్ తన పదవిని కాపాడుకున్నారని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.


సబితారెడ్డిని కలిసిన మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు

కాంగ్రెస్‌తో రహస్య ఒప్పందం..?

కాంగ్రెస్‌తో రహస్య ఒప్పందం కుదుర్చుకుని, 'ముళ్లను ముళ్లతోనే తీయాలి' అనే నానుడిని సబితారెడ్డి అమలు చేసినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల సభ్యులు, బీజేపీ సభ్యులు, బీఆర్ఎస్‌లోని అసంతృప్త సభ్యులు కలిసి అవిశ్వాసం పెడితే.. కాంగ్రెస్ తరపున గెలిచిన ఇద్దరు ఒరిజినల్ కాంగ్రెస్ సభ్యుల మద్దతుతోనే అవిశ్వాసం వీగేలా ఆమె పావులు కదిపినట్టు ప్రచారం జరుగుతోంది. ఇందుకు వారితో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్టు కొందరు కాంగ్రెస్ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. అందుకే పట్నం మహేందర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి లాంటి బడానేతలు బతిమిలాడినా 'ఆ ఇద్దరు' ససేమిరా అన్నట్టు తెలుస్తోంది. మొత్తం మీద బీఆర్ఎస్ అధికారంలో లేకున్నా తన పరపతిని ఉపయోగించి మాజీ మంత్రి సబితారెడ్డి పైచేయి సాధించడంతో.. ఆమె రాజకీయ చతురత ముందు ఎవరైనా దిగదుడుపే అనే వ్యాఖ్యలు పరిశీలకుల నుంచి సైతం విన్పిస్తున్నాయి. అయితే 46 మంది సభ్యులు ఉన్న మీర్‌పేట్‌లో కేవలం 15 మంది(అవిశ్వాసం అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ సభ్యులు మినహా) బీఆర్ఎస్ సభ్యులే మేయర్ వైపు ఉండడాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతున్నారు. మేయర్ భర్త వ్యవహారశైలి వల్లనే ఈ పరిస్థితి అని ఆమె పలువురు పార్టీ నేతల వద్ద తలపట్టుకున్నట్టు తెలిసింది.

వారిని తిరిగి చేరదీయొద్దు

మేయర్‌పై అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలు పెట్టి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ సభ్యులను తిరిగి ఎట్టి పరిస్థితుల్లోనూ చేరదీయొద్దని 15 మంది బీఆర్ఎస్ సభ్యులు, పార్టీ నేతలు సబితారెడ్డితో తెగేసి చెప్పినట్టు తెలిసింది. అవిశ్వాసం వీగిపోయిన నేపథ్యంలో మంగళవారం మేయర్‌తో పాటు బీఆర్ఎస్ సభ్యులు, పలువురు పార్టీ నేతలు సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సదరు సభ్యులు మాట్లాడుతూ ఏడెనిమిది మంది బీఆర్ఎస్ సభ్యులు అటు వైపు వెళ్లినందున మళ్లీ వారిని ఇటువైపు(బీఆర్ఎస్ వైపు) రానీయొద్దని ఆమెతో స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిసింది. వారిని చేరదీస్తే తాము మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని స్పష్టం చేసినట్టు సమాచారం. దానికి సబిత స్పందిస్తూ.. 'సరే చూద్దాం లెండి' అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

దుబ్బకుంటను పరిశీలించిన తహసీల్దార్

ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు



దుబ్బకుంటను సందర్శించిన అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీంద్ర దత్తు, రెవెన్యూ అధికారులు నాటిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డు

హయత్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన 'దుబ్బకుంట మాయం' కథనానికి అనుహ్య స్పందన లభించింది. మంగళవారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీంద్ర దత్తు సిబ్బందితో కలిసి దుబ్బకుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 631లో సుమారు 88 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. మొత్తం ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ కబ్జా అయిందో కూడా సర్వే చేస్తామన్నారు. ఇరిగేషన్ అధికారులు కుంట రికార్డుల్లో లేదని అంటున్నారని తెలిపారు. కుంట ప్రభుత్వ భూమిలో ఉన్నా.. అది ప్రభుత్వానికే చెందుతుందన్నారు. చెరువుల కబ్జాను సహించేది లేదన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తుర్కయంజాల్ గ్రామస్థులు

ఆక్రమణకు గురైన దుబ్బకుంటను కాపాడాలని మంగళవారం తుర్కయంజాల్ గ్రామస్థులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎమ్మెల్యే అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఆక్రమణకు గురైన కుంటను సందర్శించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆయన కుంటను పరిశీలించారు.

ఎంపీపీ భర్త భూ కబ్జాపై ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డం పెట్టుకుని అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీపీ భర్త బుర్ర మహేందర్‌గౌడ్ మరో ఎంపీటీసీతో కలిసి భూకబ్జాకు పాల్పడుతున్నారని జాఫర్‌గూడ తాజా, మాజీ సర్పంచ్ భర్త కొర్ర లావణ్యరాధాకృష్ణ సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమిని కబ్జా చేయడంతోపాటు అడ్డుకున్న తనపై గుండాలతో దాడి చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మండల పరిధిలోని బాటసింగారం రెవెన్యూ సర్వేనంబర్ 10/22/ఆ లో రాధాకృష్ణకు 25 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ఈనెల 2వ తేదీన తన వ్యవసాయ భూమిలోకి ఎంపీపీ భర్త మహేందర్‌గౌడ్, బాటసింగారం ఎంపీటీసీ కేశెట్టి వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, పాన్నాలాల్ చౌదరి, ఎండీ జహంగీర్‌తో కలిసి దౌర్జన్యంగా తన భూమిలోకి చొరబడి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. తాను వారిని నిరోధించేందుకు యత్నించగా బెదిరింపులకు పాల్పడ్డారని రాధాకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. రెండు రోజుల క్రితం మరోసారి రాత్రికిరాత్రే తన 25 గుంటల భూమిని కబ్జా చేసి ప్రికాస్ట్‌తో గోడ నిర్మించారని తెలిపారు. 50 మంది కిరాయి మనుషులను అక్కడ పెట్టి సుకారం చౌదరి, మహేందర్‌గౌడ్ నిర్మాణ పనులను చేయిస్తున్నారని చెప్పారు. అక్కడికి వెళ్లిన తాను భూమిని ఎలా కబ్జా చేస్తారని ప్రశ్నించగా భూతులు తిడుతూ తనపై దౌర్జన్యంగా దాడి చేశారని... ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని బయటపడినట్లు పోలీసులకు తెలిపాడు. తన భూమికబ్జా చేసిన ఏడుగురుపై న్యాయస్థానం నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చానని తెలిపాడు. తన భూమిని కబ్జాకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇన్‌స్పెక్టర్‌ను కోరినట్లు రాధాకృష్ణ తెలిపాడు.

కూతురి పెళ్లి కోసం కూడబెట్టిన నగదు చోరీ

సరూర్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వాచ్‌మెన్‌గా, ఇళ్లలో పనిమనిషిగా చేస్తూ.. పైసా పైసా జమచేసి కూతురి పెళ్లి కోసం దాచిపెట్టిన నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం, జూరాల గ్రామానికి చెందిన గుండాల హనుమంతు, పద్మ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వలసొచ్చారు. హస్తినాపురంలోని ఓ బిల్డర్ వద్ద వాచ్‌మెన్‌గా కుదిరి, అక్కడే ఓ గదిలో ఉంటున్నారు. త్వరలో కూతురి పెళ్లి చేయాలని చూస్తున్నారు. అందుకు దంపతులు తమ కష్టార్జితంతో కొంత నగదును కూడబెట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో గుర్తు తెలియని దుండగులు గది లోపలికి ప్రవేశించి రూ.2.95లక్షలు నగదుతో పాటు మొబైల్ ఫోన్లు, తులం బంగారం, పిల్లల సర్టిఫికెట్లు అపహరించుకుపోయారు. ఈ మేరకు బాధితులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఉమా మహేశ్వరస్వామి కల్యాణం


ఉమామహేశ్వరస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వామి కల్యాణ వేడుకలను తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దంతూరి అనితామహేందర్, మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌గౌడ్, కొత్తపల్లి జైపాల్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.